# విజయవాడ డివిజన్‌లో వందేభారత్ స్లీపర్ రైళ్లు

**అత్యాధునిక సౌకర్యాలతో దసరా నాటికి పట్టాలపైకి**

**విమానంలో ప్రయాణిస్తున్న అనుభూతి కలిగేలా బోగీల డిజైన్**

**సరికొత్త డిజైన్‌తో పాటు పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లు**

**గంటకు 160 కి.మీ. వేగంతో పరుగులు పెట్టేలా బోగీలు సిద్ధం**



భారతీయ రైల్వేలో మరో కీలక మైలురాయిగా నిలిచే వందేభారత్ స్లీపర్ రైళ్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు ప్రయాణికులకు కూర్చుని ప్రయాణించే వందేభారత్ రైళ్లు మాత్రమే అందుబాటులో ఉండగా, తొలిసారిగా రాత్రి ప్రయాణాలకు అనువుగా స్లీపర్ వెర్షన్‌ను ప్రవేశపెట్టేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దసరా నాటికి విజయవాడ డివిజన్‌లో ఈ రైళ్లను పట్టాలెక్కించాలనే లక్ష్యంతో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ మీదుగా సికింద్రాబాద్, చెన్నై, విశాఖపట్నం మార్గాల్లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు విజయవంతంగా నడుస్తుండగా, ఇప్పుడు స్లీపర్ రైళ్లు అందుబాటులోకి రావడం ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని కల్పించనుంది. విమాన ప్రయాణాన్ని తలపించే సౌకర్యాలు : వందేభారత్ స్లీపర్ రైళ్లను అత్యాధునిక సాంకేతికతతో రూపొందిస్తున్నారు. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ బోగీల్లో ఆకర్షణీయమైన ఇంటీరియర్స్, ఆధునిక బెర్తులు, ఎల్ఈడీ లైటింగ్, సౌండ్ ప్రూఫ్ డిజైన్, హైస్పీడ్ వైఫై, మొబైల్, ల్యాప్‌టాప్‌ల కోసం ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. ఆటోమెటిక్ డోర్లు, సీసీటీవీ నిఘా, ప్రత్యేక భద్రతా సెన్సర్లు, ఆధునిక అగ్నిమాపక వ్యవస్థ వంటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉంటాయి. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఈ రైళ్లను రూపొందిస్తున్నారు. ఒక రైలులో 16 బోగీలు ఉండే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రయాణికులకు సమయం ఆదా వందేభారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి రావడం వల్ల ముఖ్యంగా సుదూర ప్రయాణాలు చేసే వారికి ఎంతో ప్రయోజనం కలగనుంది. రాత్రి వేళల్లో సౌకర్యవంతంగా నిద్రిస్తూ గమ్యస్థానానికి వేగంగా చేరుకునే అవకాశం ఉంటుంది. తక్కువ ప్రయాణ సమయం, మెరుగైన భద్రత, పరిశుభ్రమైన బోగీలు, ఆధునిక సౌకర్యాలు ప్రయాణ అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్తాయి. వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలతో ప్రయాణించే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. రహదారి రవాణాతో పోలిస్తే వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రత్యామ్నాయంగా వందేభారత్ స్లీపర్ రైళ్లు నిలవనున్నాయి. విజయవాడ డివిజన్‌లో ఈ సేవలు ప్రారంభమైతే ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ భారత రైల్వే ప్రయాణాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైనట్టేనని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

# ఏపీ చేనేత కళకు జాతీయ గౌరవం

**ఇద్దరు నేతన్నలకు పురస్కారాలు**

**ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు చేనేత కళాకారులకు జాతీయ అవార్డులు**

**వెంకటగిరికి చెందిన నక్కా వెంకటేశ్వరరావుకు ఉత్తమ మార్కెటింగ్ విభాగంలో పురస్కారం**

**శ్రీకాకుళంకు చెందిన మురకల నటరాజ్‌కు చేనేత నైపుణ్యంలో ప్రత్యేక గుర్తింపు**

**ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం రోజున అవార్డుల ప్రదానం**



ఆంధ్రప్రదేశ్ చేనేత రంగానికి జాతీయ స్థాయిలో మరోమారు విశేష గౌరవం దక్కింది. రాష్ట్రానికి చెందిన ఇద్దరు నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులు 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక 'జాతీయ చేనేత పురస్కారాలకు' ఎంపికయ్యారు. తిరుపతి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఈ నేతన్నలు తమ అద్భుత ప్రతిభతో ఈ అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటగిరి చీరలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన నక్కా వెంకటేశ్వరరావు 'ఉత్తమ మార్కెటింగ్' విభాగంలో జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. వీరి కుటుంబం గత ఆరు దశాబ్దాలుగా చేనేత వృత్తినే నమ్ముకుని, వెంకటగిరి వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని ఆర్జించి పెట్టడంలో కీలక పాత్ర పోషిస్తోంది. అదేవిధంగా, శ్రీకాకుళం జిల్లా ఆలికాం గ్రామానికి చెందిన మురకల నటరాజ్ సైతం ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. గత 15 ఏళ్లుగా చేనేత రంగంలో కొనసాగుతున్న ఆయన, తన అద్భుత పనితీరుతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రసిద్ధ పొందూరు కాటన్‌తో అత్యంత నాణ్యమైన జమ్దానీ చీరలను నైపుణ్యంతో రూపొందించడంలో ఆయన సిద్ధహస్తులు. అంతేకాకుండా, సుమారు 50 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ చేనేత రంగంలో ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. ఎంపికైన ఈ ఇద్దరు కళాకారులు 2026, ఆగస్టు 7న నిర్వహించనున్న 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాలను అందుకోనున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం దరఖాస్తుదారులకు కొత్త చిక్కులు

**సర్వర్ ఆధార్ సమస్యలతో నిరాశగా వెనుదిరిగిన వైనం కోర్ పరిధిలో**

**ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు**

**ప్రక్రియలో అర్హుల తల్లిదండ్రుల ఆధార్ తో లింక్**

**అవిలేని దరఖాస్తుదారుల్లో నిరాశ**

**ప్రత్యామ్నాయం చూపాలని విజ్ఞప్తి**

**మొదటి రోజే మొరాయించిన సర్వర్**

**హైదరాబాద్ లో ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు సమస్య**




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే పేదలకు లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పథకంలో భాగంగా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోనూ ఇళ్లను నిర్మించుకునేందుకు మంగళవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అయితే, గ్రేటర్‌లో తొలి రోజే దరఖాస్తుదారులకు పలు చోట్ల చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఇంటి కోసం అప్లై చేసుకోవాలనుకునే వారి తల్లిదండ్రుల ఆధార్ కార్డులను కూడా కచ్చితంగా అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో చాలా మంది దగ్గర అవి లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. మరోవైపు పలు ప్రాంతాల్లో సర్వర్ మొరాయించడంతో మీసేవా కేంద్రాల్లో తీవ్రంగా రద్దీ నెలకొంది. ఆధార్ లేకుంటే ఎలా మరి : ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు ప్రక్రియలో అర్హుడి ఆధార్ కార్డుతో పాటు వారి తల్లి, తండ్రి ఆధార్ కార్డులను కూడా తప్పక అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అలా సమర్పించని దరఖాస్తులను కంప్యూటర్లు తీసుకోవడం లేదు. దీంతో పలు కారణాల వల్ల తమ తల్లిదండ్రుల ఆధార్ కార్డులు లేని ఎంతో మంది దరఖాస్తుదారులు పథకానికి అప్లై చేసుకోలేకపోతున్నారు. దీనికి తోడు మొదటి రోజే సర్వర్ మొరాయించింది. దీంతో నగర వ్యాప్తంగా పలు మీసేవా కేంద్రాల దగ్గర రద్దీ నెలకొంది. ఈ సమస్య మధ్యాహ్నం వరకు వేధించింది. తర్వాత నుంచి సాఫీగా సాగడంతో తొలిరోజు 250 మంది దరఖాస్తులు పూర్తయినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయం కల్పించాలి 2010 నుంచి రాష్ట్రంలో ఆధార్ కార్డులు వచ్చాయి. వీటిపై అవగాహన లేక చాలా మంది రెండు, మూడు సంవత్సరాల వరకు వాటిపై ఆసక్తి చూపలేదు. 2013, 2014 నుంచి క్రమంగా హైదరాబాద్‌లో ఆధార్ కార్డులు తీసుకోవడం జోరందుకుంది. కానీ, ఎవరైనా ఆధార్ తీసుకోకుండామరణిస్తే, వారి సంతానం ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అప్లై చేసుకోవడానికి వీలు లేకుండా పోతోంది. ఈ సమస్య వల్ల అవి లేని వారిలో నిరాశ మొదలైంది. దీనికి పరిష్కారంగా ప్రత్యామ్నాయం చూపాలంటూ దరఖాస్తుదారులు కోరుతున్నారు. ఒక్కో సెగ్మెంట్‌లో 7,680 ఇళ్లు రాష్ట్రంలో ఇప్పటి వరకు హైదరాబాద్ మహానగర పరిధి మినహాయించి మిగిలిన 32 జిల్లాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. స్థలాల కొరత వల్ల గ్రేటర్‌లో ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు ఎదురయ్యాయి. మొత్తం 26 నియోజకవర్గాల్లో 16 సెగ్మెంట్లలో స్థలాలు గుర్తించారు. ఒక్కో సెగ్మెంట్లో 480 చొప్పున మొత్తం 7,680 ఇళ్ల నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించారు. తక్కిన నియోజకవర్గాల్లోనూ ఇళ్ల కోసం త్వరలోనే స్థలాలను గుర్తిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. వీరు పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకోకూడదు బహుళ అంతస్తుల్లో అందించనున్న ఇందిరమ్మ ఇళ్ల ఫ్లాట్లను తూర్పు, పడమర ముఖాలతో నిర్మిస్తున్నారు. ఈ ఫ్లాట్లను పొందిన లబ్ధిదారులు పది సంవత్సరాలకు విక్రయించడానికి అవకాశం లేదు. ఈ ఇళ్లకు సంబంధించి టూ వీలర్ పార్కింగ్‌కు మాత్రమే వీలుంది. వీటిలో లబ్ధిదారుడి వాటా కింద కేటాయించే సమయంలో రూ.లక్ష, ఆర్‌సీసీ నిర్మాణ దశలో రూ.2 లక్షలు, కట్టడం పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు, ఇంటిని అప్పగించే సమయంలో తక్కిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

# క్యాబ్ డ్రైవర్ అరాచకం

**నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి మహిళపై అఘాయిత్యం**

**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్న మహిళపై క్యాబ్ డ్రైవర్ దాడి**

**మార్గమధ్యంలో వాహనాన్ని నిర్మానుష్య ప్రాంతానికి మళ్లించి అఘాయిత్యం**

**బాధితురాలి ఫిర్యాదుతో గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు**

**విచారణలో నేరం అంగీకరించిన నిందితుడు ఎర్రపోగు ప్రశాంత్ కుమార్**

**నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించిన న్యాయస్థానం**



హైదరాబాద్ నగరంలో ఒక అమానుష ఘటన చోటుచేసుకుంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానా శ్రయానికి వెళ్తున్న ఓ మహిళా ప్రయాణికురాలిపై క్యాబ్ డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన పోలీసులు, నిందితుడిని గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే, బాధితురాలు విమానాశ్రయానికి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేసుకుంది. క్యాబ్ డ్రైవర్ ఎర్రపోగు ప్రశాంత్ కుమార్ (23), మార్గమధ్యంలో కారును దారి మళ్లించి ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన బాధితురాలు, వెంటనే పోలీసులను ఆశ్రయించి సమాచారం అందించింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాల సాయంతో కొన్ని గంటల్లోనే నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలు అప్రమత్తంగా ఉండాలని, డ్రైవర్ల ప్రవర్తన అనుమానాస్పదంగా అనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# హైదరాబాద్‌లో కొవిడ్ కలకలం

**వైరస్ లక్షణాలతో ఆస్పత్రులకు బాధితులు**

**నగరంలో తీవ్ర జ్వరం, దగ్గు లక్షణాలు**

**పరీక్షలు చేయకపోవడంతో వెలుగుచూడని కేసులు**

**కిట్లు, నిధుల లేమితో ఆస్పత్రులు**




దేశవ్యాప్తంగా కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండటం, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే నలుగురు మృత్యువాత పడటంతో తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు గత నెల రోజులుగా తీవ్రమైన జలుబు, జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పుల లక్షణాలతో వస్తున్న వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. అయితే, బాధితులకు కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ఈ కేసులు బయటకు రావడం లేదు. ఫలితంగా తెలంగాణలో కరోనా కేసులు 'సున్నా' అని అధికారిక వర్గాలు చూపుతున్నాయి. ఇటీవల తార్నాకకు చెందిన ఒక మహిళ ఊపిరితిత్తులు దెబ్బతిని మరణించడం, గాంధీ ఆస్పత్రిలో ఒక కేసు నమోదవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ, ప్రజారోగ్య విభాగం నుంచి ఎలాంటి హెచ్చరికలు గానీ, పరీక్షల ఆదేశాలు గానీ జారీ కాకపోవడం గమనార్హం. నాలుగేళ్లుగా కిట్లు, మాస్కులు, శానిటైజర్ల కొనుగోలును నిలిపివేయడంతో ఆస్పత్రుల్లో తీవ్ర కొరత ఏర్పడింది. ఐసీఎంఆర్ నివేదికల ప్రకారం జూన్ నుంచి దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్నట్లు స్పష్టమవుతున్నా, రాష్ట్రంలో వ్యాధుల తీవ్రతను పర్యవేక్షించాల్సిన ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్‌పీ) నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# హింస, వేధింపులతో విసిగిపోయాను

**లొంగిపోయిన మావోయిస్టు కమాండర్ భార్య**

**ప్రభుత్వ పునరావాస విధానానికి ఆకర్షితురాలై జనజీవన స్రవంతిలోకి**

**15 నేరారోపణ కేసుల్లో ప్రధాన నిందితురాలు**

**మావోయిస్ట్ శ్రేణులకు గిరిడీలో గట్టి ఎదురుదెబ్బ**

**ఆమె భర్త అరెస్ట్ అయిన మూడు రోజులకే లొంగుబాటు**



ఆర్గనైజేషన్ అంతర్గత వేధింపులు, గ్రామస్థులపై శ్రేణులు జరుపుతున్న అనవసర హింసతో విసిగిపోయానని చెబుతూ ఒక కీలక మహిళా మావోయిస్ట్ నేత ఝార్ఖండ్‌లోని గిరిడీ పోలీసుల ఎదుట లొంగిపోయారు. సీపీఐ (మావోయిస్ట్) ఏరియా కమిటీ సభ్యురాలైన అనితా కిస్కూ అలియాస్ బబిత మంగళవారం సీనియర్ పోలీస్ అధికారుల సమక్షంలో ఆయుధాలను విడిచిపెట్టి లొంగిపోయారు. రూ. 25 లక్షల బహుమతి కలిగిన ప్రముఖ మావోయిస్ట్ కమాండర్ అజయ్ మహతో అలియాస్ టైగర్‌ను పోలీసులు అరెస్టు చేసిన మూడు రోజులకే ఆయన భార్య బబిత లొంగిపోవడం గమనార్హం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నయా దిశా ఏక్ నయా పహల్' పునరావాస విధానం ద్వారా ప్రభావితమై ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బొకారో జిల్లాకు చెందిన 30 ఏళ్ల బబిత 2009లో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఉద్యమానికి ఆకర్షితులై, 2017లో అడవిలోనే అజయ్‌ని వివాహం చేసుకున్నారు. పారస్ నాథ్, లుగు కొండలు, కోల్హాన్ ప్రాంతాల్లో చురుగ్గా పనిచేసిన ఆమెపై హత్యలు, పేలుళ్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం (యుఏపీఏ) కింద 15 కేసులు నమోదయ్యాయి. సీనియర్ నేతల వేధింపులు, వసూళ్లు, పౌరులపై దాడులతో మానసికంగా కుంగిపోవడంతో పాటు భర్త అరెస్ట్ కావడంతో ఆమె జనజీవన స్రవంతిలోకి రావాలని నిశ్చయించుకున్నారు. అనిత లొంగుబాటు ఆ ప్రాంతంలో మావోయిస్ట్ కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ అని వర్ణించిన పోలీసులు, మిగిలిన నక్సలైట్లు కూడా ఆయుధాలు వీడి సాధారణ జీవితంలోకి రావాలని పిలుపునిచ్చారు.

# కోరుట్లలో ఆర్టీసీ బస్సు చోరీ

**సినిమాను తలపించిన ఛేజింగ్**

**కోరుట్ల బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సును ఎత్తుకెళ్లిన ఆగంతకుడు**

**18 కిలోమీటర్ల పాటు ఛేజ్ చేసి వెంబడించిన పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది**

**దారిలో మూడు ద్విచక్రవాహనాలను, పోలీసు వాహనాన్ని ఢీకొట్టిన నిందితుడు**

**మెట్‌పల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి బస్సును అడ్డుకున్న పోలీసులు**

**చెట్టును ఢీకొట్టి ఆగడంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న వైనం**




జగిత్యాల జిల్లా కోరుట్లలో మంగళవారం తీవ్ర కలకలం చోటుచేసుకుంది. స్థానిక బస్టాండ్‌లో నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సును ఓ ఆగంతకుడు దొంగిలించి పోలీసులను పరుగులు పెట్టించాడు. సుమారు 18 కిలోమీటర్ల మేర సినిమాను తలపించేలా సాగిన ఛేజింగ్ అనంతరం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల బస్టాండ్‌లోని 8వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సును ఒక వ్యక్తి అకస్మాత్తుగా స్టార్ట్ చేసి నిజామాబాద్ వైపు వేగంగా నడిపాడు. దీనిని గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది కలిసి బస్సును వెంబడించారు. మార్గమధ్యంలో కోరుట్ల, ఆరపేట, వెంకట్రావుపేట ప్రాంతాల్లో మూడు ద్విచక్ర వాహనాలను సదరు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదాల్లో బైక్‌లపై వెళ్తున్న వారికి గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా, తనను వెంబడిస్తున్న పోలీసు వాహనాన్ని కూడా నిందితుడు ఢీకొట్టాడు. మెట్‌పల్లి వద్ద విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల బస్సును తృటిలో తప్పించుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు మెట్‌పల్లి మండల పరిధిలోని గండి హనుమాన్ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలను అడ్డంగా ఉంచి బస్సును నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో వేగంగా వస్తున్న బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. వెంటనే బస్సులో నుంచి కిందకు దూకి పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com